
# సాక్షి విశాఖపట్నం

శుక్రవారం ¦ 3 ¦ మార్చి ¦ 2023



## స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరు

ఉత్పాదనలో ఈ ఏడాది ఫిబ్రవరిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరును **కనబర్చిందని** యాజమాన్యం తెలిపింది. 8లో



## జీఐఎస్‌కు మూడంచెల భద్రత

జీఐఎస్‌కు పోలీస్ శాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. సభా ప్రాంగణం వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోంది. 8లో



## K9 ప్రత్యేక డాగ్ స్క్వాడ్

రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా తొలిసారిగా విశాఖలో ప్రత్యేకంగా కే9 స్క్వాడ్‌ను పోలీసు శాఖ రంగంలోకి దింపింది. 8లో

# పెట్టుబడుల పండగ నేడే

**పారిశ్రామికవర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 పెట్టుబడుల పండగ నేడు ప్రారంభం కానుంది. రూ.2 లక్షల కోట్ల వాస్తవ పెట్టుబడులే లక్ష్యంగా అధికారంలోకి వచ్చాక మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా ప్రారంభించను**న్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకునేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్తలు సదస్సుకు హాజరుకానున్నారు. అడ్వాంటేజ్ ఏపీ పేరుతో నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించనున్న పారిశ్రామికవేత్తలు ఎన్నో కీలక నిర్ణయాలు వెలువరించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.




ప్రధాన వేదిక

- ఉదయం 10.15 గంటలకు సమ్మిట్‌ను ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- దిగ్గజ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేలా ఏర్పాట్లు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఏయూ మైదానం

**సాక్షి, విశాఖపట్నం :** సుదీర్ఘమైన తీరప్రాంతం, విస్తృతమైన వనరులు.. ఎక్కడా లేని విధంగా ఇన్వెస్టర్ల ఫ్రెండ్లీ పాలసీతో పారిశ్రామికవేత్తలను రాష్ట్రం ఆకర్షిస్తున్న తరుణంలో.. ఏపీలో తమ పరిశ్రమల్ని విస్తరించేందుకు ఆహ్వానం పలుకుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జీఐఎస్–2023 సమ్మిట్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో విశాఖ వేదికగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కీలక ఎంవోయూలకు వేదికగా నిలవబోతోంది. 45 దేశాల ప్రతినిధులు, 35 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరుకానున్న సదస్సు కోసం ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఏయూ మైదానంలో సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. మిరుమిట్లు గొలిపే సభా వేదికపై సుమారు 30



చర్చలు జరిపేందుకు వీలుగా ఏర్పాట్లు

మంది అతిథులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదిక వద్ద నాలుగు వేల మంది ప్రతినిధులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి పక్కనే ఉన్న మిగిలిన హాల్స్‌లో 137కిపైగా స్టాళ్లతో ఎగ్జిబిషన్, 20కి పైగా బిజినెస్ సెషన్లు నిర్వహించనున్నారు. రెండు రోజుల సమ్మిట్‌కోసం ఇప్పటికే 15 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయంటే స్పందన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**చార్టర్డ్ ఫ్లైట్స్.. హెలికాప్టర్లు..**

సదస్సులో పాల్గొనేందుకు ముఖేష్ అంబానీ, కరణ్ అదానీ, కేఎం బిర్లా, మిట్టల్, బజాజ్, జీఎంఆర్ తదితర ప్రముఖ పారిశ్రామికవేత్తలు నేడు విశాఖకు చేరుకోనున్నారు. దాదాపు 25కి పైగా చార్టర్డ్ ఫ్లైట్స్ విశాఖలో సందడి చేయనున్నాయి. అదేవిధంగా.. కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తల్ని సమ్మిట్ జరుగుతున్న ఏయూ మైదానానికి తీసుకొచ్చేందుకు రెండు హెలికాప్టర్లను కూడా సిద్ధం చేశారు. వీటితో పాటు ఖరీదైన లగ్జరీ కార్లు సిద్ధంగా ఉన్నాయి.

**సదస్సును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

సమ్మిట్‌ను శుక్రవారం ఉదయం 10.15 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులు, వసతుల్ని పారిశ్రామిక ప్రపంచానికి పరిచయం చేసేలా



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు



నెడ్‌క్యాప్ స్టాల్



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

ప్రతి రంగానికి సంబంధించి మొత్తం 14 ఆడియో వీడియో విజువల్‌ని ప్రదర్శించనున్నారు. అనంతరం సంబంధిత శాఖ మంత్రులు ప్రసంగిస్తారు. కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో తొలిరోజు సదస్సు జరగనుంది. ఈ సదస్సు జరిగే రెండు రోజులు వివిధ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకోబోతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ అవకాశాలున్న 14 రంగాలను ప్రభుత్వం ఈ వేదికపై ప్రమోట్ చేస్తోంది. రెండు రోజుల పాటు పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయాన్నే వేదిక వద్దకు చేరుకొని సాయంత్రం వరకూ పారిశ్రామికవేత్తలతోనే ముఖాముఖి సమావేశాలు, ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాల్లో




సచివాలయం స్టాల్




పాల్గొననున్నారు. రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న సదస్సు విజయవంతం కావాలని మంత్రులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, విశాఖ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రైవేట్ ఆర్గనైజేషన్ డెలిగేట్స్‌కు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి, స్టూడెంట్ డెలిగేట్స్‌కు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రవేశానికి అనుమతిస్తారు.



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రులు విడదల రజిని, అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ, సత్యవతి



వివిధ దేశాల జాతీయ జెండాలు

## న్యూస్‌రీల్

### అనంతుని కల్యాణానికి ఏర్పాట్లు



చక్రపెరుమాళ్లను పల్లకీలో తీసుకెళ్తున్న అర్చకులు

**పద్మనాభం:** పద్మనాభంలో వెలసిన **కుంతీ** మాధవ స్వామి ఆలయంలో అనంతు**డి కల్యా**ణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. **శుక్ర**వారం రాత్రి స్వామి కల్యాణం అంగర**రంగవైభ**వంగా జరగనుంది. కాగా.. గురువార**ం రాత్రి** పుట్ట బంగారం తీసుకురావడంతో **స్వామి** కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ముందుగా కుంతీ మాధవస్వామి ఆలయంలోని చక్రపెరుమాళ్లను పల్లకీలో పాత సంత జరిగే ప్రదేశం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ మేదనీమాత(భూమాత)కు విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు. అనంతరం పుట్ట బంగారాన్ని ఆలయంలోకి తీసుకెళ్లి పాళికల్లో వేశారు. స్వామి కల్యాణం సందర్భంగా ఆలయం ముందు పచ్చని పందిళ్లు వేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో ఎస్. నానాజీ బాబు, తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు, కె.ఏర్నాయుడు పాల్గొన్నారు.

### ప్రయాణికులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి



అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

**అగనంపూడి :** రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం, అవాంతరాలు లేని సేవలు అందించడమే లక్ష్యమని వాల్తేరు డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం జాబితాలో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చోటు దక్కడంతో.. భవిష్యత్ అవసరాలను గుర్తించి మాస్టర్ ప్లాన్ రూపొందించే క్రమంలో డీఆర్‌ఎం సందర్శించారు. ముందుగా విశ్రాంతి వసతి, టికెట్ బుకింగ్ కౌంటర్లు, ఫుట్ ఓవర్ వంతెన, వాడకం నీరు వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు స్టేషన్‌లో విశాలమైన ఫుట్ ఓవర్ వంతెన నిర్మిస్తామని, లిఫ్ట్ సౌకర్యం ఇప్పటికే ఏర్పాటు చేశామని, త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం ప్రజా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. ఏడీఆర్‌ఎం సుధీర్ కుమార్ గుప్తా, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ టీఎం రావు, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఓం ప్రకాష్ మీనా పాల్గొన్నారు.

### ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాకెల్ శ్రాప్

**భీమునిపట్నం:** ప్రతి పాఠాన్ని ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఉన్న గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ సీఈవో రాకెల్ శ్రాప్ అన్నారు. గురువారం ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. రానురాను చదువుతోపాటు ఉద్యోగాలకు పోటీ విపరీతంగా పెరిగిపోతోందని దానికి తగినట్టు చదుకునే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఏ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి.. ఎటువంటి కోర్సులు అభ్యసించాలన్న అవగాహన అవసరమన్నారు. ప్రతి ఒక్కరికి చదువుతోపాటు పెద్దల పట్ల గౌరవం, సంస్కారం కూడా ఎంతో ముఖ్యమని సూచించారు. సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

### నేడు ఓడల సందర్శన

**మహారాణిపేట:** ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా, విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎఫ్‌వీ మత్స్య షికారి, ఎంఎఫ్‌వీ మత్స్యదర్శిని అనే రెండు ఓడల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ ఆరో నంబర్ జెట్టీ వద్ద ఉన్న ఓడల్లో ఉదయం 9.45 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ మెకానికల్ మెరైన్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, సాధారణ ప్రజలు ఓడలను సందర్శించవచ్చన్నారు. కోస్టుగార్డు డీఐజీ యోగిందర్ ఢాకా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు.

# సాగర నగరికి సరికొత్త శోభ



విద్యుత్ వెలుగులతో ప్రత్యేక ఆకర్షణగా నౌక



విద్యుత్ కాంతుల మధ్య తీరంలో కొబ్బరి చెట్లు

**సాక్షి, విశాఖపట్నం:** పెట్టుబడుల పండగకు విశాఖ నగరం ముస్తాబైంది. దేశవిదేశాల నుంచి వస్తున్న అతిరథ మహారథులకు సాదరంగా స్వాగతం పలకడానికి సర్వాంగ సుందరంగా సింగారించుకుంది. నభూతో అన్న చందంగా వైజాగ్ ప్రత్యేక అందాలను సంతరించుకుంది. ఎక్కడ చూసినా పండగ వాతావరణమే కనిపిస్తోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్ర, శనివారాల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) జరగనుంది. సమ్మిట్ నిర్వహణ కోసం విశాలమైన మైదానంలో ఆరు జర్మన్ హ్యాంగర్స్ వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా 46 దేశాలకు చెందిన అతిరథ మహారథులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు.



దేదీప్యమానంగా బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ కూడలి

మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరంగా అలంకరించారు. ఓ పక్క రోడ్లు మెరుస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, డివైడర్లు సరికొత్త రంగులను పులుముకుని అందంగా అగుపిస్తున్నాయి. డివైడర్ల మధ్యలో మొక్కలు చల్లగాలులు వెదజల్లుతున్నాయి. విద్యుత్ స్తంభాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. బీచ్‌రోడ్డులో డిజిటల్ లైటింగ్ నుంచి వెలుగులు లేలేత కిరణాలను తలపించేలా ప్రసరిస్తున్నాయి. రోడ్ల పక్కన గోడలకు రాష్ట్ర, విశాఖ సంస్కృతిని తెలియజేస్తూ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కూడా నిగనిగలాడుతున్నాయి. విశాఖకు విచ్చేసే ప్రముఖుల హోర్డింగులు నగరంలో అనేక చోట్ల దర్శనమిస్తున్నాయి. ఇలా విశాఖ నగరం.. దేశ విదేశాల నుంచి అడుగిడుతున్న పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానం పలుకుతోంది.

# రాష్ట్రానికి దిగ్గజ పారిశ్రామికవేత్తలు

- ముఖేష్ అంబానీ, కుమార మంగళం బిర్లా, కరణ్ అదానీ రాక
- సంజీవ్ బజాజ్, అర్జున్ ఒబెరాయ్, పునీత్ దాల్మియా, నవీన్ జిందాల్ హాజరు

**సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:** రాష్ట్ర పునర్విభజన తర్వాత మొదటిసారిగా దిగ్గజ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. గతంలో మూడుసార్లు వివిధ పేర్లతో పెట్టుబడుల సదస్సులను నిర్వహించిన చంద్రబాబు హయాంలో కేవలం కుమార మంగళం బిర్లా మినహా పెద్ద పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరుకాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మొదటిసారిగా ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)కు దిగ్గజ సంస్థలకు చెందిన పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరు కావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి అద్దం పడుతోంది.

**అప్పట్లో ఏమార్చారు..**

సన్‌రైజ్ ఏపీ, పెట్టుబడుల సదస్సులు.. ఇలా పేర్లు మార్చి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేసిన చంద్రబాబునాయుడు మూడేళ్ల పాటు షో చేశారు. చిన్న చిన్న కంపెనీలకు చెందిన ప్రతినిధులను తీసుకొచ్చి ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తలుగా పరిచయం చేస్తూ రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయంటూ ఊదరగొట్టారు. సదస్సులకు పేరున్న ఒకే ఒక్క దిగ్గజ పారిశ్రామికవేత్త వచ్చారంటే చంద్రబాబు నిర్వహించిన సదస్సుల స్థాయి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. 2017–18లో నిర్వహించిన సదస్సుకు ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థల చైర్మన్ కుమార మంగళం బిర్లా మాత్రమే వచ్చారు. బిర్లా మినహా పేరున్న పారిశ్రామికవేత్తలెవర్నీ చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి ఆహ్వానించలేకపోయింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా 34 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారు. ప్రపంచ బిలినియర్ల జాబితాలో చోటు దక్కించుకున్న ముఖేష్ అంబానీ, అదానీ గ్రూప్‌ల చైర్మన్ గౌతమ్ అదానీ కుమారుడు కరణ్ అదానీతో పాటు దిగ్గజ పారిశ్రామికవేత్తలైన కుమార మంగళం బిర్లా, సంజీవ్ బజాజ్, అర్జున్ ఒబెరాయ్, పునీత్ దాల్మియా, నవీన్ జిందాల్, టెస్లా కో ఫౌండర్ మార్టిన్, సుమిత్‌బిదానీ, జోష్ ఫాల్గర్, మసహిరో




యమగుచ్చి, సజ్జన జిందాల్, నవీన్ జిందాల్, శ్రీనివాసన్, సుమంత్ సిన్హా తొలిసారిగా రాష్ట్రానికి, విశాఖకు వస్తున్నారు.

**ఒప్పందాలకూ సై...!**

గతంలో చంద్రబాబు హయాంలో సదస్సుకు హాజరైనప్పటికీ పెట్టుబడులు పెట్టేందుకు మాత్రం పెద్దగా ఆసక్తి చూపించ లేదు. ఇక దిగ్గజ పారిశ్రామిక సంస్థల నుంచి వారి ప్రతినిధులు మాత్రమే హాజరయ్యేవారు. ఈ సారి అందుకు భిన్నంగా సదస్సుకు పలువురు దిగ్గజ పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరయ్యేందుకు మొగ్గుచూపడం గమనార్హం. అంతేకాకుండా పాల్గొనడంతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు కూడా తమ ఆసక్తిని చూపుతూ అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

**ఏపీ వైపు చూపు...!**

ఏపీలో ఉన్న అపారమైన సముద్రతీర ప్రాంతంతో పాటు దేశంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక కారిడార్లలో మూడు పారిశ్రామిక కారిడార్లు ఏపీలో ఉండటం బాగా కలిసివస్తోంది. ఈ పారిశ్రామిక కారిడార్లల్లో భారీ ఎత్తున దాదాపు 48 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. అంతేకాకుండా ఆయా పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇక పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయడం, వారి రాయితీలను స్పష్టంగా ఒక తేదీని ప్రకటించి మరీ మంజూరు చేయడం పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. అంతేకాకుండా 2023 – 28 కాలానికి కొత్త పారిశ్రామిక పాలసీని ప్రభుత్వం తయారు చేస్తోంది. ఈ పాలసీలో పరిశ్రమల ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కసరత్తును ప్రభుత్వం చేస్తోంది. అందువల్లే దిగ్గజ సంస్థలు సైతం ఏపీ వైపునకు చూస్తున్నాయనే అభిప్రాయం పారిశ్రామికవర్గాల్లో వ్యక్తమవుతోంది.

## దేశంలో మూడో స్థానంలో ఏపీ టూరిజం

ఎయిర్‌పోర్టులో పర్యాటక హెల్ప్ డెస్క్ ప్రారంభించిన మంత్రి రోజా



ఎయిర్‌పోర్టులో ఏపీ టూరిజం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

**సాక్షి, విశాఖపట్నం:** దేశంలో ఏపీ టూరిజం మూడో స్థానంలో ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. విశాఖ విమానాశ్రయంలో గురువారం ఆమె పర్యాటక హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాట్లు, హెల్ప్‌డెస్క్ పని తీరును పరిశీలించారు. కరోనా కారణంగా పర్యాటక రంగం దెబ్బతిందని.. జీఐఎస్ సదస్సు ద్వారా పర్యాటకానికి ఊతం లభిస్తుందన్నారు. తిరుపతి, విశాఖలో ఒబెరాయ్ హోటళ్లు ఏర్పాటవుతున్నట్లు చెప్పారు. 26 జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రోజా మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 స్థానాలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తులు లేకుండా..ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు రెండుసార్లు డేట్లు ఇచ్చి.. తన సినిమా షూటింగులు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి.. మా ప్రభుత్వంలో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

## పెట్టుబడులకు విశాఖ అనుకూలం

పల్సస్ సీఈవో శ్రీనుబాబు



**సీతంపేట:** రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషితో పరిశ్రమల స్థాపన, పెట్టుబడులకు విశాఖపట్నం అద్భుతమైన గమ్యస్థానంగా మారిందని పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) నేపథ్యంలో గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వ్యాపారాలు విస్తరించాలని, తమ సంస్థలు స్థాపించాలని ఎదురు చూస్తున్న పెట్టుబడిదారులకు జీఐఎస్ అద్భుతమైన వేదికన్నారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు సమ్మిట్‌లో పాల్గొనున్నారని తెలిపారు. విశాఖలో 50వేలకు పైగా ఐటీ నిపుణులు, లక్షలాది మంది ఫార్మా, హెల్త్‌కేర్ నిపుణులు ఉన్నారని చెప్పారు. ఇటీవల జరిగిన గ్లోబల్ టెక్ సమ్మిట్, ఇప్పుడు జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో రాబోయే రెండేళ్లలో 5 లక్షల మంది ఐటీ, హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్ ప్రొఫెషనల్స్ అందుబాటులోకి వస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలతో విశాఖ పోటీ పడుతోందన్నారు. సీఎం కృషితో నగరంలో అనేక పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు, తయారీ యూనిట్లు, ఫార్మా, వైద్య పరికరాల తయారీ సంస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహణతో విశాఖ కీర్తి విశ్వవ్యాప్తం అవుతుందని వెల్లడించారు.






## ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం

'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023'లో పాల్గొనేందుకు విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ స్వాగతం పలికారు. రుషికొండలోని రాడిసన్ హోటల్‌కు చేరుకున్న సీఎం జగన్‌కు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పుష్పగుచ్ఛం అందజేశారు. దారి పొడవునా ప్రజలు పూలవర్షంతో తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## పలు రైళ్ల రీ షెడ్యూల్

**తాటిచెట్లపాలెం:** సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న ఎర్నాకుళంలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరాల్సిన ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ 3.30 గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ నెల 5వ తేదీన ఉదయం ఆరు గంటలకు అలప్పుజలో బయలుదేరాల్సిన అలప్పుజ-ధన్‌బాద్(13352) ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 9 గంటలకు బయలుదేరుతుంది.

# జీఐఎస్‌కు మూడంచెల భద్రత

- 2,500 మందితో పటిష్ట బందోబస్తు
- ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్
- సీసీ కెమెరాలతో పాటు సభా ప్రాంగణాలపై నిఘా
- నేడు, రేపు ఏయూ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు


భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్

**దొండపర్తి:** గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోంది. అతిథుల భద్రత కోసం గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ఇప్పటికే వీవీపీలు బస చేసే ప్రాంతాలు, సభా ప్రాంగణం పరిసరాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

జీఐఎస్ సదస్సు జరిగే ప్రాంగణంలోనే కాకుండా దాని పరిసర ప్రాంతాల్లో కూడా నిఘా పెట్టారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ప్రతి ఒక్కరినీ ప్రత్యక్షంగా గమనించేందుకు వీలుగా ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను ఈ సెంటర్ నుంచే పరిశీలించనున్నారు.

**బందోబస్తుకు 2,500 మంది సిబ్బంది**

ప్రముఖుల భద్రత, బందోబస్తు కోసం పోలీస్ శాఖ 2,500 మంది అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చినప్పటికీ నుంచి వారు హోటల్‌కు వెళ్లేంత వరకు వారికి కట్టుదిట్టమైన భద్రతను కల్పించనున్నారు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, రిసార్టులు, గెస్ట్ హౌస్‌లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని సదస్సు ప్రాంగణం, హెలిపాడ్, ప్రతినిధులకు వసతి కల్పించే హోటళ్ల వద్ద స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్స్‌తో జల్లెడ పట్టారు. నగరంలో ముఖ్య ప్రాంతాల్లో పికెట్స్, గార్డులను ఏర్పాటు చేసి నిరంతరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నగర కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పలు శాఖల అధికారులతో పాటు, రాష్ట్ర అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ భద్రత, ఇతర ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు. సభ ప్రాంగణంలోకి నిర్దేశించిన ప్రవేశ మార్గాల ద్వారా వెళ్లేందుకు రూట్‌మ్యాప్ తయారు చేశారు. ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరవుతుండడంతో పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

**భారీ వాహనాల మళ్లింపు**

సదస్సు జరిగే రెండు రోజులు ప్రజలు, వాహనచోదకులు రద్దీగా ఉండే ప్రాంతాల వైపు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ ఆంక్షల దృష్ట్యా శుక్ర, శని వారాల్లో బీచ్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

- 3, 4 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం నుంచి విశాఖ మీదుగా అనకాపల్లి వైపు వెళ్లే అన్ని రకాల భారీ వాహనాలను ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం మీదుగా మళ్లించనున్నారు. అలాగే అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే అన్ని రకాల భారీ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో సదస్సు జరుగుతున్న దృష్ట్యా మద్దిలపాలెం జంక్షన్ ఏయూ ఆర్చ్ నుంచి త్రీ టౌన్‌పోలీస్‌స్టేషన్ జంక్షన్ వరకు ఎటువంటి సాధారణ వాహనాలను అనుమతించరు.
- సదస్సు పరిసర ప్రాంతాలైన పోలమాంబ గుడి నుంచి సిరిపురం వరకు, స్వర్ణభారతి జంక్షన్‌నుంచి మద్దిలపాలెం వరకు, వేమన మందిర్ నుంచి టైకూన్ జంక్షన్ వరకు, కురుపాం జంక్షన్, పార్క్ హోటల్, సీఆర్ రెడ్డి సర్కిల్, ఆల్ ఇండియా రేడియో జంక్షన్, నోవాటెల్, సర్క్యూట్ హౌస్ పరిసర ప్రాంతాలు సదస్సుకు వచ్చే వాహనాలతో రద్దీగా ఉండే అవకాశముంది. ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు 3, 4 తేదీల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.
- 3వ తేదీన బీచ్ రోడ్డుకు వచ్చే సందర్శకులు తమ వాహనాలను ఏపీఐఐసీ గ్రౌండ్, విశ్వప్రియ గ్రౌండ్, పోలీస్ గెస్ట్‌హౌస్ వెనుక గల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- సదస్సుకు హాజరయ్యే సాధారణ ప్రతినిధులు మద్దిలపాలెం, త్రీటౌన్ వైపు నుంచి ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులోకి ప్రవేశించి వారికి నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలపాలి.
- నిర్దేశించిన వాహనాలు మినహా ఇతర వాహనాలు ఎస్పీ బంగ్లా వైపు నుంచి లోపలకు అనుమతించరు.



## ఉత్పాదనలో స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరు



**ఉక్కునగరం:** ఉత్పాదనలో ఈ ఏడాది ఫిబ్రవరిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరును కనబర్చిందని యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరిలో రోజుకు సగటున 15,004 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేసిందని.. రెండు ఫర్నేస్‌లు కలిపి ఇప్పటివరకు ఇదే అత్యుత్తమ ఉత్పాదన అని పేర్కొంది. బీఎఫ్-1 నుంచి 2,12,000 టన్నులు, బీఎఫ్-2 నుంచి 2,08,100 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి కూడా ప్లాంట్ ప్రారంభం నుంచి ఫిబ్రవరిలో సాధించిన అత్యుత్తమ పనితీరు అని వెల్లడించింది. అలాగే డబ్ల్యూఆర్ఎం-1 నుంచి 91,356 టన్నుల వైర్‌రాడ్‌ల ఉత్పత్తి, ఎస్‌బీఎం నుంచి 53,453 టన్నుల ఉత్పత్తి, డబ్ల్యూకెఆర్ఎం-2 నుంచి 56,722 టన్నుల వైర్‌రాడ్, స్ట్రక్చరల్ మిల్ నుంచి 48,853 టన్నుల స్ట్రక్చరల్ ఉత్పత్తి సాధించినట్లు పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ అద్భుత పనితీరు కనబర్చడంలో కృషి చేసిన సిబ్బందిని సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

## అక్షరాకృతిలో జీ-సమ్మిట్

విశాఖ మహా నగరంలో జరగనున్న జీ- సమ్మిట్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని తర్లువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం చేసిన విన్యాసం అందరినీ ఆకట్టుకుంది. సుమారు 130 మంది విద్యార్థులు జీ-సమ్మిట్ అక్షరాకృతిలో వరుస క్రమంలో ఇమిడి ప్రదర్శనిచ్చారు. - ఆనందపురం(భీమిలి)



## నేడే కోనేటిరాయుని కల్యాణం


అశ్వవాహనంలో స్వామివారి తిరువీధి సేవ

**నక్కపల్లి:** కోనేటిరాయుని కల్యాణానికి వేళయింది. ఉపమాక గరుడాద్రి పర్వతంపై ఏకశిలపై వెలసిన లోకేశుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి తిరుకల్యాణానికి గురువారం రాత్రి అంకురార్పణ జరిగింది.

## ప్రతిష్టాత్మకంగా పెట్టుబడుల సదస్సు

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ముత్తంశెట్టి

**మహారాణిపేట (విశాఖ దక్షిణ):** గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మద్దిలపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సదస్సులో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న సదస్సుపై పారిశ్రామిక దిగ్గజాలు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. దాదాపు 25 దేశాల నుంచి 4,800 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. దేశ, విదేశాల పారిశ్రామిక వేత్తలను ఆకర్షించేలా సదస్సు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పెట్టుబడులకు ఏపీ స్వర్గధామంగా ఉండడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి పెట్టుబడిదారుల సదస్సు ఇదేనన్నారు. పారిశ్రమల ఏర్పాటు చేసే పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ముత్తంశెట్టి పేర్కొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో బీచ్ సుందరీకరణ

- మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


బీచ్ సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఆదిమూలపు

**దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ)/ ఆరిలోవ (విశాఖ తూర్పు):** అంతర్జాతీయ ప్రమాణాలతో విశాఖ బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి మంత్రి రాడిసన్ హోటల్ నుంచి ఎంజీఎం పార్కు వరకు నగర సుందరీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విశాఖను ప్రపంచంలోనే నంబర్ వన్ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నగరంలో జరుగుతున్న సుందరీకరణ పనులు సంతృప్తినిచ్చాయన్నారు. జీ-20 సదస్సు జరిగే సమయానికి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి బీచ్‌లున్నాయని వీటికి తోడు మరో 5 బీచ్‌లు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నగరంలో ప్రతి బీచ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. సీతకొండ వ్యూ పాయింట్ నుంచి సముద్రం లోపల కొంత మేరకు గ్లాస్ మార్గం ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆనందం, ఆహ్లాదం కల్పించడంతో పాటు పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు, డీసీపీలు, పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఏఎంఓహెచ్‌లు పాల్గొన్నారు.

## జీఐఎస్‌తో పారిశ్రామిక రంగానికి ఊతం

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు

**మహారాణిపేట:** గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) సదస్సు రాష్ట్ర చరిత్రలోనే మైలురాయిగా నిలవనుందని, కరోనా నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పారిశ్రామిక రంగానికి ఊతమందిస్తుందని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని వనరులు ఉన్న విశాఖ ప్రపంచపటంలో టాప్ నగరాల్లో నిలవనుందన్నారు. విశాఖలో గత ప్రభుత్వ హయాంలో చాలా సదస్సులు జరిగాయని.. వాటి ద్వారా పెట్టుబడులు గోరంత వస్తే.. ప్రచారం మాత్రం కొండంత చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కొత్త పారిశ్రామిక విధానంతో పెట్టుబడులకు స్వర్గధామంగా మారనుందన్నారు. 2021-22లో ఏపీలో 11.43 శాతం వృద్ధి రేటును నమోదైందని గుర్తు చేశారు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలోని భోగాపురం, నెల్లూరు జిల్లాలోని దగదర్తిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కరోనా విజృంభించిన సమయంలో కూడా రాష్ట్రంలో ఒక్క సంక్షేమ పథకం కూడా ఆగలేదన్నారు. సచివాలయం ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రానున్న తరానికి కచ్చితమైన ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారని కొనియాడారు.

# K9 ప్రత్యేక డాగ్ స్క్వాడ్

- రాష్ట్రంలో తొలిసారి విశాఖలో ఏర్పాటు
- జీఐఎస్‌లో భద్రతకు 13 పోలీస్ జాగిలాలతో తనిఖీలు
- మూడు కేటగిరీలుగా విభజన


కే9 స్క్వాడ్

**దొండపర్తి:** ప్రతిష్టాత్మక గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖ పోలీస్ శాఖ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు పలువురు కేంద్రమంత్రులు, దేశంలోని దిగ్గజ పారిశ్రామికవేత్తలు, దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆహ్వానించేందుకు నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. వీవీఐపీలు, వీఐపీలతో పాటు ఇతర ప్రతినిధుల రక్షణ కోసం 2,500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసింది. నగరంలో ప్రధాన జంక్షన్లు, ప్రాంతాల్లో పికెటింగ్‌లు పెట్టడంతో పాటు సభా ప్రాంగణం, ప్రముఖులు బస చేసే హోటళ్లు, రిసార్టుల వద్ద మూడంచెల భద్రతా విధానంతో పటిష్ట నిఘా పెట్టింది. అలాగే రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా తొలిసారిగా విశాఖలో ప్రత్యేకంగా 'కే9 స్క్వాడ్'ను ఏర్పాటు చేసి రంగంలోకి దింపింది. జీఐఎస్‌లో ప్రముఖుల భద్రత సేవల కోసం 13 పోలీస్ జాగిలాల బృందంతో నగరంలో అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతోంది.

**మూడు జాతులతో ప్రత్యేక బృందం**

రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ పోలీసులు 'కే9 స్క్వాడ్' పేరుతో స్నిఫర్ డాగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. లాబ్రడార్, డాబర్‌మాన్, జర్మన్ షెపర్డ్ వంటి మూడు జాతుల జాగిలాలతో జీఐఎస్‌లో తనిఖీలకు ఓ బృందాన్ని సిద్ధం చేశారు. జాగిలాల హ్యాండ్లర్లైన సిబ్బందికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ కేటాయించారు. ఇందులో గ్రేసీ, మార్టిన్, రియో, జానీ, రాకీ, యోధా, బ్లాకీ, బ్రూటస్, బిట్టు, సీజర్, లక్కీ, రూబీ, జాకీ పేర్లతో ఏడు ఆడ జాగిలాలతో పాటు మొత్తం 13 ఉన్నాయి. వీటిలో రూబీ జర్మన్ షెపర్డ్ కాగా, జాకీ, సీజర్‌లు డాబర్‌మాన్ జాతికి చెందినవి. మిగిలినవన్నీ లాబ్రడార్లు. అలాగే ఇతర జిల్లాల నుంచి మరో 14 స్నిఫర్ డాగ్స్‌ను కూడా రప్పించి తనిఖీలు చేపడుతున్నారు.

**తనిఖీల్లో జాగిలాల పాత్ర కీలకం**

భద్రత సిబ్బంది తనిఖీలో పోలీస్ జాగిలాల పాత్ర అత్యంత కీలకం. కేవలం పేలుడు పదార్థాలను మాత్రమే కాకుండా కొన్ని కేసుల్లో నిందితుల అన్వేషణ, నార్కోటిక్స్‌ను గుర్తించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఇవి మనుషుల కంటే 40 రెట్లు మెరుగ్గా వాసన పసికట్టే గుణం కలిగి ఉంటాయి. ప్రతి 20 నిమిషాల పనికి ఒక్కో జాగిలానికి 10 నిమిషాలు విశ్రాంతి ఇస్తారు. అత్యంత క్రమశిక్షణతో అనేక కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ జాగిలాలతో ప్రత్యేక ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ నిర్ణయించారు. దీంతో కే9 పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వాస్తవానికి నాలుగు పదునైన కోరలు కలిగిన జాగిలాలను కెనైన్‌గా సంబోధిస్తారు. దీంతో ఆ పేరునే కాస్త ట్రెండీగా కే9గా పిలుస్తున్నారు. ఈ కే9 స్క్వాడ్‌లో బాంబ్ డిటెక్షన్, ట్రాకర్స్, నార్కోటిక్స్ మూడు కేటగిరీలు ఉన్నాయి. ఈ బృందం ఇప్పటికే సభా ప్రాంగణం వద్దే కాకుండా వీవీఐపీలు బస చేసే ప్రాంత పరిసరాల్లో కూడా తనిఖీలు చేపడుతోంది.